క్లుప్తంగా

ముగిసిన యోగా శిక్షణ



యోగా శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న గురూజీ

నరసాపురం రూరల్: యోగా అనేది సున్నితమైన వ్యాయామం, శ్వాస నియంత్రణ కలిగిన పురాతన అభ్యాసమని ప్రముఖ యోగా గురువు రంజిత్ గురూజీ పేర్కొన్నారు. గత పది రోజులుగా నరసాపురం తెలగా కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఉచిత ధ్యాన-యోగ శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంజిత్ గురూజీ మాట్లాడుతూ యోగా గురించి శిక్షకులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఈ శిక్షణ గురువారం నుంచి తూర్పుతాళ్లు గ్రామంలోని హైస్కూల్ సమీపంలోని శ్రీ రాజగోపాల స్వామి వారి ఆలయ ప్రాంగణంలో తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్నట్లు వాసవిక్లబ్ సభ్యులు తెలిపారు. గురువారం సాయంత్రం 6గంటలకు ప్రారంభ కార్యక్రమంతో శిక్షణ ప్రారంభంఅవుతుందని వివరించారు.

ఘనంగా రక్షణ సైన్యం స్థాపన దినోత్సవం



ఆచంట పెదపేటలోని రక్షణ సైన్యం

పెనుగొండ: ఎన్నో సేవా కార్యక్రమాలు అందిస్తున్న రక్షణ సైన్యం ఏర్పడి 160 ఏళ్లు అవుతుందని సంఘ సేవకురాలు జి.ప్రశాంతి అన్నారు. బుధవారం ఆచంట పెదపేటలో రక్షణ సైన్యం ఆవరణలో స్థాపన దినోత్సవం నిర్వహించారు. ప్రపంచ దేశాల్లో రక్షణ సైన్యం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. విద్య, వైద్య, సాంఘిక సేవా కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ముఖ్యంగా కుష్టు రోగులకు సాంఘిక సేవ చేస్తూ అనేక భాషల్లో విద్యనందిస్తుందన్నారు.

కిడ్నీ బాధితులకు సాయం



బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్న వసుధ ఫౌండేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పోడూరు మండలంలోని పోడూరు గ్రామానికి చెందిన కిడ్నీ బాధితులు సీహెచ్ సత్యనారాయణ, శాంతకుమారి దంపతులకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందించింది. బుధవారం వసుధ ఫౌండేషన్ కన్వీనర్ బుద్దరాజు అనారోగ్య బాధిత దంపతులకు రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వడ్రంగి పని చేస్తూ జీవనం సాగిస్తున్న సత్యనారాయణ తన భార్యతో సహా ఇద్దరూ గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. వీరి సమస్య వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట్రామరాజుకు తెలియడంతో ఆర్థిక సహాయం అందించారని బుద్దరాజు తెలిపారు.

అభివృద్ధి బాటలో పెనుగొండ



పెనుగొండ గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్యామలా సోనీ శాస్త్రి

పెనుగొండ: పెనుగొండను అభివృద్ధి బాటలో ముందుకు తీసుకువెళ్తున్నట్లు సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి తెలిపారు. బుధవారం పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ ఇటీవల పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అలాగే త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు చేసిన తీర్మానాలు ఆమోదించారు. సచివాలయ సిబ్బంది పురోగతి నివేదికలు సమర్పించారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు

భీమవరం అర్బన్: సొంతంగా భూమిని సాగు చేసే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డు మంజూరు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి వైవీఎస్ ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని రాయలం, చినఅమిరం గ్రామాల్లో బుధవారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వైవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డు కాల పరిమితి 11నెలలు మాత్రమే ఉంటుందన్నారు. అర్హులైన సొంతంగా సాగు చేసే రైతులకు, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా కౌలు గుర్తింపు కార్డువల్ల పంట నమోదు చేసుకోవడమే కాకుండా ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు తలెత్తవన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, వీఏఏ కె. మౌనిక , నీటి సంఘం ఉపాధ్యక్షుడు కోళ్ల సీతారామ్, సీహెచ్ సతీష్, దొంగా రామకృష్ణ, గొట్టుముక్కల మురళీకృష్ణంరాజు, బి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నరసాపురంలో మంచినీటికి కటకట

- పట్టణ చరిత్రలో తొలిసారి అంటున్న పట్టణవాసులు
- వాటర్ ప్లాంట్‌ల వద్దకు క్యూ కడుతున్న వైనం
- చేతులెత్తేసిన అధికారులు



మున్సిపల్ కార్యాలయం వద్ద పబ్లిక్ ట్యాప్ వద్ద మంచినీటి కోసం టిన్నులతో క్యూ కట్టిన జనం

నరసాపురం: జిల్లాలో ఎక్కడాలేని విధంగా భారీ విస్తీర్ణంలో సువిశాల మంచినీటి చెరువు ఉన్న నరసాపురం పట్టణంలో గత మూడు రోజుల నుంచి జనం మంచినీటికి విలవిల్లాడుతున్నారు. బిందెడు మంచినీళ్లు కూడా దొరక్క అల్లాడిపోతున్నారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ అధికారులు, సిబ్బంది చేస్తున్న ఆందోళనలో భాగంగా మంచినీటి సరఫరాకు సంబంధించి అత్యవసర పనులను కూడా బహిష్కరించారు. దీంతో మొత్తం పట్టణంలో మంచినీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. దీనికి తోడు మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఇంజినీరింగ్ విభాగం మంచినీటి సరఫరా అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవపోవడం, వాటర్‌వర్క్స్‌లో వ్యవహారాలను తూతూ మంత్రంగా వార్డు సచివాలయ ఉద్యోగులకు అప్పగించి చేతులు దులుపుకోవడంతో సమస్య తీవ్రమైంది.

మూడు రోజులుగా ఇక్కట్లు

పట్టణంలో సగం వార్డులకు మూడురోజులుగా కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా జరగడం లేదు. పొన్నపల్లి, వాధవాయిపాలెం, స్టేషన్‌పేట, అరుంధతీపేట, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాలకు మంచినీటి సరఫరా జరగడం లేదు. మిగిలిన ప్రాంతాల్లో కూడా నామ మాత్రంగానే మంచినీటి సరఫరా జరుగుతోంది. దీనికి తోడు మంగళవారం ఉదయం వాటర్ వర్క్స్ సెక్షన్‌లో వాల్వ్ రిపేరు రావడం, అనుభవం లేని సిబ్బందితో దానిని సరి చేయడానానికి అర్ధరాత్రి పట్టింది. నీళ్లు లేకపోవడంతో జనం మంచినీటి ఖాళీ టిన్నులు పట్టుకుని కుళాయి చెరువువద్ద ఉన్న కుళాయిల దగ్గరకు వస్తున్నారు. అక్కడ పెద్ద క్యూలైన్‌లు కనిపిస్తున్నాయి. సాక్షాత్తు ఎమ్మెల్యే నివాస ప్రాంతం పీచుపాలెంలో కూడా మంచినీటి సరఫరా నిలిచిపోయినా కూడా ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం, పక్క మున్సిపాలిటీల నుంచి పర్మినెంట్ కార్మికులను తెప్పించుకుని పని చేయించుకోవడం, ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరా చేయడం వంటి ఉపశమన చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నరకం చూస్తున్న వ్యాపారులు

పట్టణంలో మంచినీటి సరఫరా లేకపోవడంతో వ్యాపారులు నరకం చూస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్స్, తిరుబండారాలు తయారీ వంటి వ్యాపారులకు మంచినీరు చాలా ప్రధానమైంది. నీళ్లు లేకపోవడంతో కొందరు వ్యాపారస్తులు షాపులు మూసేస్తున్నారు. పట్టణంలో నీటి ఎద్దడి ఇంత తీవ్రంగా వేధిస్తున్నా రెవెన్యూ అధికారులు గానీ, స్థానిక ఎమ్మెల్యే గానీ తమకు పట్టనట్టు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రహదారిని బాగు చేయాలని ధర్నా



మట్టపర్రు రోడ్డులో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పాలకొల్లు సెంట్రల్: గోతులతో బురదమయంగా ఉన్న మట్టపర్రు రహదారిని బాగు చేయాలంటూ గ్రామస్తులు ధర్నా చేశారు. బుధవారం పోడూరు మండలం మట్టపర్రు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో రహదారిపై బైటాయించారు. దాదాపు మూడు గంటల సమయం ధర్నా నిర్వహించారు. ధర్నాతో పాలకొల్లు, మార్టేరు రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రహదారిలో నిత్యం ప్రయాణం చేయలేకపోతున్నామని నాయకులు హామీలు ఇచ్చినంత వేగంగా పనులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తంచేశారు. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్నారు. రాజకీయ నాయకులు, అధికారులు వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని లేదంటే ఈ సారి ప్రధాన రహదారిని నిర్బంధిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల నిరసన



నరసాపురం: మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షలు చేస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: దీక్షలో పాల్గొన్న ఇంజనీరింగ్ కార్మికులు

నరసాపురం: మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమసమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఆందోళన పదో రోజుకు చేరుకుంది. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద రిలేదీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన విరమించేదిలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులైజ్ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోటిపల్లి కాశీ, ఎం.రత్నం, సీహెచ్ సత్యనారాయణ, ఫణి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ మునిసిపల్ ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు మొదలు పెట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారానికి పదో రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం తమ ఆవేదనను పట్టించుకుని సాధ్యమైనంత త్వరలో తమ సమస్యలు పరిష్కరించాలంటూ కోరారు. ఒకవేళ ప్రభుత్వం ఏమీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమానవేతనమే అడుగుతున్నామని పేర్కొన్నారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే గుర్తింపు



సిబ్బందికి సర్టిఫికెట్స్ అందిస్తున్న జిల్లా ఎస్పీ

నరసాపురం: బాధ్యతలు సక్రమంగా నిర్వహించే ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి తగిన గుర్తింపు ఉంటుందని జిల్లా ఎస్పీ నయీం అస్మి అన్నారు. మండలంలోని పాతనవరసపురం గ్రామంలో గత ఏడాది డిసెంబర్‌లో కోడి పందేల జూదరులను పట్టుకుని, నరసాపురం కోర్టు నుంచి క్యాష్ రివార్డు పొందిన నరసాపురం పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ మేరకు నరసాపురం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు నుంచి క్యాష్ రివార్డు పొందడం పోలీసు శాఖ గౌరవంగా భావిస్తుందని అన్నారు. ఇలాంటి పోత్సాహకం, గౌరవం ద్వారా పోలీసులు మరింత చురుగ్గా పని చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ భీమారావు, నరసాపురం డీఎస్పీ శ్రీవేద, టౌన్ సీఐ యాదగిరి, రూరల్ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాల పెంపు లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ ప్రోగ్రాం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ వైఎఫ్ఎస్ఐ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు సమాజంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటికి తగిన నూతన సూచనలను అందించాలనేది ప్రధాన అంశమని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ కె.భద్రాచలం, డా. బి.వెంకటస్వామి, వైఎఫ్ఎస్ఐ కోఆర్డినేటర్ డాక్టర్ వి.విజయలక్ష్మి, డాక్టర్ సీహెచ్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ గంగాధరరావు

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు కోరారు. బుధవారం మండలంలోని చిన తాడేపల్లి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ గంగాధరరావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను అవలంబించాలన్నారు. ఎరువులు, పురుగు మందుల పిచికారికి అవసరమైన డ్రోన్లను సైతం సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి వి.నారాయణ రావు మాట్లాడుతూ స్వర్ణ రకం వరి వంగడాన్ని సాగు చేసే రైతులు ఎకరానికి 20 కిలోల పొటాష్‌ను మొదటి కోటాలో వేసుకోవాలన్నారు. ఈ సీజన్‌లో వాతావరణం దృష్ట్యా అవసరం మేర నత్రజని వాడుకోవాలన్నారు. పంట రుణం పొందిన రైతులు బ్యాంకును సంప్రదించి పంటల బీమా కట్టాలని, రుణం పొందని రైతులు పంటల బీమా కోసం రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, వ్యవసాయ విస్తరణాధికారి డి.విద్యాసాగర్, వీఏఏ టి.ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి బి.రమేష్, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని లయన్స్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ ఫాస్ట చైర్మన్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. డైమండ్స్‌క్లబ్ 2025-26 సభ్యులు ప్రమాణ స్వీకారం బుధవారం స్థానిక బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో కొపిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా మద్దుకూరి మెహర్ ప్రసాద్, కార్యదర్శిగా కోటి విజయ్ కిషోర్, అడ్మిన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, ఉపాధ్యక్షుడిగా కాళ్ల గోపికృష్ణ, చెన్నారెడ్డి సతీష్, మానేపల్లి వెంకట సునీల్ కుమార్, కోనా హనుమాన్, కేవీ కమల, బోళ్ల రాము, ఆకుల సతీష్, డాక్టర్ గురుస్వామిలు ఎంపికయ్యారు. నూతన కమిటీచే పదం కుమర్ గుప్తా విద్యా ప్రోత్సాహం క్రింద ప్రగతి కళాశాల సహకారంతో కంప్యూటర్, మానేపల్లి సునీల్, కోనా హనుమాన్‌లు సహకారంతో పేద మహిళకు కుట్టు మిషన్, లంకా శ్రీనివాస సహకారంతో క్యాన్సర్ రహిత శానిటరీ ప్యాడ్స్, పేరిచర్ల ఫౌండేషన్ సహకారంతో రైస్ బ్యాగ్, నిత్యావసర వస్తువులు పంపిణీ, కొప్పిశెట్టి రమణయ్య సహకారంతో పేద విద్యార్థికి రూ.11,000లు నగదు కళాశాల ఫీజ్‌గా అందజేశారు. మాజీ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, ఉప గవర్నర్ ఆర్‌వీఎస్ సూర్యనారాయణ రాజు, డాక్టర్లు మైథిలి, సూరపు రమాదేవి, కనీజ్ మహ్మద్, కోడూరి భాను సత్యనారాయణ, యోగ ట్రైనర్స్ చిక్కాల అంబికా, డాన్స్ టీచర్ శ్రీలలిత, ఆడిటర్ ఎన్‌వీ రమణారావు, నూకల నాగ మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

చదువుకుంటేనే మెరుగైన జీవితం



ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొల్లు సెంట్రల్: చదువుకుంటేనే మెరుగైన జీవితం ఏర్పడుతుందని ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఈ విషయాన్ని అవగాహన చేసుకుని తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలంటూ బీఆర్ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. బుధవారం స్థానిక లాకు సెంటర్, చింతలతోట, బ్రహ్మానందరెడ్డి కాలనీల్లో ఈ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ తమ ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న ఎన్రోల్మెంట్ డ్రైవ్ సత్ఫలితాలనిస్తుందన్నారు. తల్లిదండ్రులు పనుల్లోకి వెళ్లాక తమ పిల్లలు బయట రోడ్లపై తిరుగుతున్నారని వారిని గుర్తించి వాళ్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పిల్లలను స్కూలుకు తీసుకువస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులకు బోధనల్లో ఇబ్బందులు లేకుండా ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీవీఎస్‌వీఆర్ఎం పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు అనిశెట్టి వెంకటేశ్వరరావు, ఐపిసిహెచ్ శ్రీనివాస్, రమాదేవి, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాత హుండీ ఆదాయం లెక్కింపు

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. 100 రోజులకు రూ.5,76,505 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లురావు తెలిపారు. అన్నదానం హుండీ ద్వారా రూ.25,626 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. దేవాదాయ శాఖ తణుకు ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించినట్లు వివరించారు.

ఎంఈఓకు సమ్మె నోటీసు అందజేత



పెనుగొండ ఎంఈఓకి సమ్మె నోటీసు అందిస్తున్న ప్రైవేటు పాఠశాల సంఘాల నాయకులు

పెనుగొండ: మండలంలో ప్రైవేటు పాఠశాలలో గురువారం బంద్ పాటించనున్నట్లు ప్రైవేటు పాఠశాలల సంఘ నాయకులు ఎంఈఓ డి.శుభాకరరావుకు బుధవారం సమ్మె నోటీసు సమర్పించారు. రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘ ఆదేశాల మేరకు బంద్ పాటిస్తున్నట్లు వివరించారు. ప్రైవేటు పాఠశాలలు సజావుగా పనిచేయడానికి ఆటంకం కలిగించే విధంగా నియమాలు, నిబంధనలు ఏకపక్షంగా అమలు చేయడం వల్లే బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తేతలి సుబ్బారాయుల రెడ్డి, కొమ్ముల రామకృష్ణ, గుత్తల వెంకటేశ్వరరావు, మిస్ మేరీ, ప్రకాశ్, తురగా శేఖర్, బ్రిలియంట్ రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థినులు పది పరీక్షా ఫలితాల్లో అత్యున్నత మార్కులు సాధించి ట్రిబుల్ ఐటీలో సీట్లు పొందడం గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కందుకూరి పద్మావతి అన్నారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థినులు పడాల కావ్యశ్రీ 587 మార్కులతో నూజివీడు, కొలుకులూరి తన్మయ ప్రియ 580 మార్కులతో ఇడుపులపాయ, పాలాటి వర్షిణి 578 మార్కులతో శ్రీకాకుళం, తిరుపతిపాటి శ్రీవల్లి 578 మార్కులతో ఒంగోలు ట్రిబుల్ ఐటీల్లో సీట్లు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: సీజనల్‌గా వచ్చే వ్యాధులను నిరోధించాలంటే ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని పైడిపర్రు హైస్కూల్‌లో బుధవారం జాతీయ డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం విజృంభించే డెంగీ నివారణ ఇంటి నుంచే ప్రారంభం కావాలని, సమర్ధవంతమైన ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే డెంగీ నివారణ సాధ్యమన్నారు. నిరుపయోగ కంటైనర్లలో మంచి నీటి నిల్వలు లేకుండా చేసుకోవడం ద్వారా దోమపుట్టుకకు చెక్ పెట్టవచ్చని, ప్రతి రోజూ డ్రైడే కార్యక్రమం ఒక శక్తివంతమైన విధానమని, వర్షాకాలం దోమల పుట్టుకకు అనువైన కాలమని అందువలన ప్రతి సీజన్‌లో చేతుల శుభ్రత, ఈగలు వాలకుండా ఆహార పదార్థాలు ఉన్న పాత్రలపై విధిగా మూతలు ఉంచాలని, కాచి చల్లార్చి వడబోసిన నీటిని తాగాలని తద్వారా అతిసారం, టైఫాయిడ్, జాండిస్ వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని అన్నారు. జ్వరం ఉంటే సమీపంలోని వైద్యుల వద్దకు వెళ్లాలని సూచించారు.

మావుళ్లమ్మకు విశేష పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మ వారికి వైజాగ్‌కి చెందిన ఈమని సూర్య సంపత్ బుధవారం భారీ గజమాల సమర్పించారు. వీరికి ఆలయ ఉపప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ వీరికి ప్రసాదాలు అందజేశారు. అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తల్లికి వందనం రెండో జాబితా ఎప్పుడు?



మేడపాడు సచివాలయంలో తల్లికి వందనం రెండవ విడత జాబితా ఆరా తీస్తున్న దృశ్యం

యలమంచిలి: తల్లికి వందనం రెండో జాబితా జూన్ 30న విడుదల చేసి జూలై 5న లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం జూలై మూడు వచ్చినా ఇంకా జాబితా విడుదల చేయకపోవడంపై విద్యార్థుల తల్లులు ఆందోళన చెందుతున్నారు. అధికారంలోనకి వచ్చిన ఏడాది తరువాత కూటమి ప్రభుత్వం గత నెల 12న మొదటి విడత తల్లికి వందనం వేసిన సంగతి తెలిసిందే. అయితే మొదటి విడత జాబితాలో సుమారు 20 శాతం మందికి డబ్బులు పడలేదు. ఎందుకు పడలేదో ఇన్‌ఎలిజబుల్ లిస్ట్‌లో పేరులు చూసుకున్న లబ్దిదారులకు నాలుగు చక్రాల వాహనం ఉందని, మూడెకరాల కంటే ఎక్కువ భూమి ఉందని, సరాసరి విద్యుత్ వాడకం నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ ఉందని, ప్రభుత్వ ఉద్యోగం ఉందని, ఇన్‌కం టాక్స్ కడుతున్నారని తదితర కారణాలు చూపించి ఆ 20 శాతం మందికి అమ్మకు వందనం కోత పెట్టారు.

గ్రీవెన్స్‌లో పెట్టి ఎదురుచూపులు

చాలా మంది లబ్ధిదారులు గతంలో మాకందరికీ అమ్మ ఒడి పడిదంటూ సచివాలయాలకు వచ్చారు. సచివాలయ సిబ్బంది మీ పేరున ఏవైతే అభ్యంతరాలు వచ్చాయో అవి నిజం కాదని పత్రాలు తెచ్చుకుంటే అవి గ్రీవెన్స్‌లో పెడతామని చెప్పడంతో లబ్ధిదారులంతా ఆర్‌టీఓ కార్యాలయానికి వెళ్లి నాలుగు చక్రాల వాహనం లేదని, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఎక్కువ భూమి లేదని, విద్యుత్ సబ్ సేషన్‌కు వెళ్లి సరాసరి వార్షిక విద్యుత్ వినియోగం 300 యూనిట్లు లేదని, ఆడిటర్‌ల నుంచి ఇన్ కంటాక్స్ కట్టడం లేదని పత్రాలు, ప్రభుత్వ ఉద్యోగం లేదని సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చి గ్రీవెన్స్ రైజ్ చేశారు. ఇలా గ్రీవెన్స్ రైజ్ చేసిన వారందరిని పరిశీలించి అర్హుల జాబితా జూన్ 30 విడుదల చేస్తామని చెప్పారు. తీరా జూలై మూడు వచ్చినా అర్హుల జాబితా ప్రకటించకపోవడంపై లబ్దిదారుల్లో ఆందోళన నెలకొంది. దీంతో రెండు రోజులుగా జాబితా వచ్చిందా? అంటూ లబ్దిదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌లు రాలేదని చెప్పడంతో నిస్పృహతో వెనుదిరుగుతున్నారు. విద్యార్థులు ఎంతమంది ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఇప్పుడు అసలుకే ఎసరు పెట్టేలా ప్రభుత్వ వ్యవహారం ఉందని తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.